
ప్రజాశక్తి
ఆదివారం 21 సెప్టెంబర్ 2025



హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల్లోని వసతి గృహ నిర్వహణ బాధ్యతలు సక్రమంగా నిర్వహించని ప్రధానోపాధ్యాయులు, వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు గిరిజన సంక్షేమ శాఖ డిడి ఆర్.కృష్ణవేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న వాట్సాప్ గ్రూప్లో వచ్చిన ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం, గిరిజన విద్యార్థులకు శాపం వార్తకు ఆమె శనివారం స్పందిస్తూ విషయం తెలిసిన వెంటనే కొమరాడ మండలంలో కెమిసీలను సిబ్బందితో కలిసి తనిఖీ చేశామని పేర్కొన్నారు. పాఠశాల, వసతి గృహ నిర్వహణ సక్రమంగా నిర్వహించడం లేదని గుర్తించడం జరిగిందన్నారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ప్రధానోపాధ్యాయుడు, డిప్యూటీ వార్డెన్ అయిన ముత్యాల రామారావుకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు ఆమె ఆ ప్రకటనలో తెలిపారు.

సమిష్టి కృషితో స్వచ్ఛ పార్వతీపురం

పార్కులో వాలీబాల్, కబడ్డీ కోర్టులు ఏర్పాటు : కలెక్టర్

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

జిల్లాలోని ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, అధికారుల సమిష్టి కృషితోనే స్వచ్ఛ పార్వతీపురం సాధ్యపడుతుందని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని చర్చి వీధిలో గల డాక్టర్ సన్యాసిరాజు మునిసిపల్ పార్కు వద్ద స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ పార్వతీపురం కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పారిశుధ్య కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, మొక్కలను నాటి, స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రపై అధికారులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ పార్క్ ప్రాంతాన్ని పరిశీలించారు. పార్క్‌లో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో వాలీబాల్, కబడ్డీ, తదితర కోర్టులను ఏర్పాటు చేసే దిశగా పనులు ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస రాజుకు సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ పార్వతీపురం ఒక్క రోజు కార్యక్రమంతో సరిపోదని, ఇది అలవాటుగా మారాలని పేర్కొన్నారు. ప్రతి రోజూ తమ ఇంటి పరిసరాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాల యాలు, వాణిజ్య, వ్యాపార సంస్థలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే స్వచ్ఛ పార్వతీపురం సాధ్యం కాగలదని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.. కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫకీర్ రాజు, సచివాలయాల శానిటరీ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

పక్కాగా ఓటరు జాబితా : డిఆర్‌డిఎ పీడీ

ప్రజాశక్తి - సాలూరు

ఓటరు జాబితా పక్కగా సిద్ధం చేయాలని నియోజక వర్గం ప్రత్యేక అధికారి ఎం.సుధారాణి తెలిపారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, బిఎల్‌ఒలతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రకారం ప్రతి ఇంటికీ వెళ్లి పరిశీలించాలని, కొత్త ఓటర్లను నమోదు చేయాలని తెలిపారు. శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లను గుర్తించాలన్నారు. పోలింగ్ బూత్‌లు దూరంగా ఉన్న ఓటర్ల జాబితా గుర్తించాలని ఆదేశించారు.

13 గంటల పని దినం నిర్ణయాన్ని

తక్షణమే ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్

కార్మికులు, ఉద్యోగుల చట్టబద్ధ హక్కు 8 గంటల పని దినాన్ని 13 గంటలుగా మార్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర అసెంబ్లీలో ఇంతవరకు రాష్ట్రంలో అమల్లో ఉన్న 8 గంటల పని దినాన్ని 13 గంటల పని దినంగా మారుస్తూ నిర్ణయం చేయడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శనివారం స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఉన్న గాంధీ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని, అందులో భాగంగానే శుక్రవారం అసెంబ్లీలో 8 గంటల పనిదినాన్ని 13 గంటలుగా మారుస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.. కూటమి ప్రభుత్వ కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక ఉద్యోగ వర్గాలు పోరాడుతాయని హెచ్చరించారు. 1920లోనే స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా 8 గంటల పని దినం నినాదాన్ని గాంధీతో పాటు వివిధ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని, దీనికి అనుగుణంగానే అప్పటి నుండి 8గంటల పని దినం మన దేశంలో అమలవుతుందని తెలిపారు. స్వాతంత్ర్యానంతరం 1948లో పారిశ్రామిక చట్టం దేశంలో అమలైనప్పటి నుంచి 8 గంటల పని దినం అనేది దేశంలో అమలవుతుందని, అంతటి చారిత్రాత్మకమైన నిర్ణయాన్ని ఈరోజు తుంగలో తొక్కడం అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు దాసోహమయ్యాయనడానికి ఇదే ఉదాహరణ అని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం 13 గంటల పని దినాల నిర్ణయాన్ని ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. లేనిచో ఈ సమస్యపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ బి.సూరిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు సంచాన ఉమామహేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం అధ్యక్షులు మండంగి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో నిరసన



గాంధీ బొమ్మ వద్ద నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

పాలకొండ : కార్మికులు, ఉద్యోగులు చట్టబద్ధ హక్కు 8 గంటల పని దినాన్ని మార్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. శనివారం పాలకొండ సిఐటియు ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం 8 గంటలకు పని దినాన్ని 13 గంటల పని దినంగా మారుస్తూ తీసుకున్న నిర్ణయం ఉప సంహరించు కోవాలని డిమాండ్ చేశారు. లేనిచో ఈ సమస్యపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అర్తమూడి లక్ష్మణరావు, కాద రాము, భవనిర్మాణ కార్మిక సంఘం ప్రతినిధులు పెద్దగాడ రమణ, ఎ.ఈశ్వరరావు, ఎ.ధనంజయరావు, ఎస్.గంగరాజు, ఎస్.బాలరాజు, ఎ.రవికుమార్, ఎల్ కామేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ కోర్టులు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

గ్రామ రెవెన్యూ కోర్టులు నిర్వహించి ఆయా గ్రామాల్లోనే రెవెన్యూ కేసులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డ్టార్ ఎన్. ప్రభాకర రెడ్డి ఆదేశించారు. పిటిషనర్లను కార్యాలయానికి పిలిపించకుండా వారి వద్దకే వెళ్లి న్యాయాన్ని అందించాలన్నారు. గ్రామ రెవెన్యూ కోర్టులు నిర్వహించడం ద్వారా కేసులు త్వరితగతిన పరిష్కరించడానికి అవకాశం ఉంటుందన్నారు. శనివారం సబ్ కలెక్టర్లతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ డివిజనల్ రెవెన్యూ కోర్టుల్లో కేసు నమోదైన 3 నెలల్లోగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్లను ఆదేశించారు. శనివారం ఉదయం కలెక్టర్ రెవెన్యూ కేసులను సమీక్షిస్తూ కేసులను గ్రామాల వారీగా గుర్తించి ముందస్తుగా ఇరువర్గాలకు నోటీసులిచ్చి ఆయా గ్రామాల్లోనే కోర్టులను నిర్వహించి అక్కడికక్కడే తీర్పు వెలువరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ రెవెన్యూ కోర్టులు నిర్వహించడానికి ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకొని ఒక నిర్దిష్ట ప్రణాళికతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కూడా ఈ రెవెన్యూ కోర్టుల్లో పాల్గొనడం జరుగుతుంది. జిల్లాలో రెండు డివిజన్లలో సుమారు 120 కేసులు సబ్ కలెక్టర్ల దగ్గర నమోదై ఉన్నాయని, వాటిన్నింటినీ 3 నెలలలోగా పరిష్కరించాలని నిర్దేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు ఆర్. వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాథ్ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు సహకరించండి : డిఎస్‌పి

ప్రజాశక్తి - పాలకొండ

ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు జరుగు కోటదుర్గమ్మ దసరా నవరాత్రి ఉత్సవాలకు ప్రజలంతా సహకరిం చాలని డిఎస్‌పి ఎం.రాంబాబు అన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరులతో మాట్లాడారు. యాత్ర దగ్గర క్యూలైన్లు ఏర్పాటు చేశామని వచ్చిన వారు క్యూ లైన్ మార్గంగా అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. ఉత్సవాలు జరుగుతున్న సమయంలో ట్రాఫిక్ ఆంక్షలు కూడా అమలు చేస్తున్నామని, దీనికి అంతా సహకరించాలని కోరారు. పార్వతీపురం నుంచి వచ్చే వాహనాలు అన్నవరం పక్క నుంచి రాజాం మీద వెళ్లాలని కోరారు. రాజాం నుంచి వచ్చే వాహనాలు అన్నవరం మీదుగా వెళ్లాలన్నారు. శ్రీకాకుళం నుంచి వచ్చే వాహనాలు అటు సీతంపేట మీదుగా ఇటు అన్నవరం మీదగా వెళ్లాలన్నారు. భారీ వాహనాలను లోపలికి అనుమతించడం లేదన్నారు. అదేవిధంగా పట్టణంలో కూడా వాహనాలు నిలిపివేతకు పార్కింగ్ కోసం స్థలాలు కేటాయించామన్నారు. అన్నవరం రూట్లో ఆర్ అండ్ బి డిఇ కార్యాలయం దగ్గర పార్వతీపురం రూట్లో గ్యాస్ ఆఫీస్ దగ్గర, విక్టరీ బజార్ దగ్గర వాహనాలు నిలుపుదలకు స్థలం కేటాయించామన్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో 30సిసి కెమెరాలున్నాయని, వాటి ద్వారా పూర్తిస్థాయిలో నిఘా పెడతామన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై బైండోవర్ కేసులు కూడా నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సిఐ ఎ.ప్రసాదరావు, ఎస్సై ప్రయోగమూర్తి ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డిఎస్‌పి రాంబాబు

గిరిజన నిరుద్యోగుల అరెస్టులను ఖండించండి

- స్పెషల్ డిఎస్‌సి వెంటనే తీసి గిరిజనులకు జరిగిన నష్టాన్ని భర్తీ చేయాలి
- నిరుద్యోగులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర ప్రభుత్వం తీసిన మెగా డీఎస్సీలో గిరిజన నిరుద్యోగులకు నష్టం జరిగిందని, ఆ నష్టాన్ని భర్తీ చేసి స్పెషల్ డీఎస్సీ ప్రకటించి గిరిజన ప్రాంతంలో ఉన్న ఉపాధ్యాయ పోస్టులను గిరిజనులకు ఇవ్వాలని శనివారం ఆదివాసీ నిరుద్యోగుల సంఘం పిలుపు మేరకు సాలూరులో గల గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతిని ఇవ్వడానికి వెళ్తున్న గిరిజన నిరుద్యోగులను అరెస్టు చేయడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు తీవ్రంగా ఖండించారు. జియ్యమ్మవలసలో శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సాలూరులో నిరసన తెలియజేయడానికి వెళ్తున్న డీఎస్సీ నిరుద్యోగులను పోలీస్ యంత్రాంగం నిర్బంధంగా 20మంది నిరుద్యోగులను అరెస్టు చేశారని, అలాగే గుమ్మలక్ష్మీపురంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గంగారాంను అదుపులోకి తీసుకున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు గిరిజన ప్రాంతంలోని ఉద్యోగాలు నూటికి నూరు శాతం గిరిజనులకు ఇస్తామని, జిఒ 3 స్థానంలో ప్రత్యేకమైన చట్టం తీసుకొస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరకు, పాడేరు, కురుపాం సభల్లో ప్రకటించారని ఆ దిశలో చర్యలు ప్రారంభించకపోవడంతో దుర్మార్గమని అన్నారు. ఈరోజు తీస్తున్న మెగాడిఎస్‌సిలో గిరిజన ప్రాంతానికి తీవ్ర నష్టం జరుగుతుందని, వేలాది మంది గిరిజన యువత బిఇడి శిక్షణ పొంది ఉన్నారని, వీరందరికీ న్యాయం చేయాలంటే స్పెషల్ డీఎస్సీ ప్రకటించి వెంటనే గిరిజన ప్రాంతంలో ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసి గిరిజన యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గిరిజన ప్రాంతంలో మిగిలిన శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసి జీవో 3 ప్రకారం గిరిజనులకు ఉద్యోగ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన గిరిజన యువతను వెంటనే విడుదల చేయాలని వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీ గిరిజన సంఘం ఖండన

పార్వతీపురం: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల కోసం స్పెషల్ డిఎస్సీ నిర్వహిస్తామని, జీవో3కు ప్రత్యామ్నాయ జీవో జారీ చేస్తామని హామీ ఇచ్చిన సిఎం చంద్రబాబు నాయుడు మాట నిలబెట్టుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.రామస్వామి డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక సుందరయ్య భవనంలో విలేకరులతో మాట్లాడారు. పాడేరు ఎన్నికల పర్యటనకు వచ్చిన సిఎం చంద్రబాబు నాయుడు జీవో3కు బదులుగా కొత్త జీవో తీసుకొచ్చి చట్టబద్ధత కల్పిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చి 15 నెలలైనా దీనిగురించి మాట్లాడడం లేదన్నారు. గిరిజన నిరుద్యోగులకు స్పెషల్ డిఎస్సీ నిర్వహణపై ఇచ్చిన హామీ ని మర్చిపోయారని చెప్పారు. అందుకని ఆయా జిల్లాల్లో ఆదివాసీ గిరిజన సంఘంగా ఐటిడిఎ పిఒ, కలెక్టర్, ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేలను, ఈ జిల్లా పరిధిలో ఉన్న గిరిజన శాఖ మంత్రిని కలిసి జీవో నెంబర్ 3 కల్పించాలని, మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ పోస్టులు మినహాయింపు ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. కానీ ఆ వినతులను పట్టించుకున్న దాఖలాల్లేవన్నారు. అందుచేతే ఆదివాసీ నిరుద్యోగుల సాధన కమిటీ పేరుతో చలో సాలూరు పిలుపునిచ్చారని చెప్పారు. పోలీసులు నిర్బంధం తీవ్రతరం చేయడంతో ఎక్కడికి అక్కడే అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లో తరలించడం అన్యాయమని చెప్పారు. సిఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు ఆరిక గంగారావు, సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంగునాయుడు

ఎస్ఎఫ్ఐ నాయకుడ్ని నిర్బంధించిన పోలీసులు

గుమ్మలక్ష్మీపురం: జిఒ 3కు ప్రత్యామ్నాయం కల్పిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయమని అడిగితే పోలీసులతో నిర్బంధాలు చేయించడం ఎంతవరకు సబబు అని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎ.గంగారావు ప్రశ్నించారు. గిరిజన సంఘాల పిలుపు మేరకు శనివారం చేపట్టిన గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణి ఇంటి ముట్టడికి అనుమతి లేదంటూ ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గంగారావును ఎల్విన్ పేట పోలీసులు డిగ్రీ కళాశాల పోస్ట్ మెట్రిక్ బాలుర వసతి గృహంలోనే నిర్బంధించారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం జిఒ 3కు ప్రత్యామ్నాయం తీసుకొచ్చి గిరిజన నిరుద్యోగులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు ప్రత్యామ్నాయం తీసుకురాకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఇప్పటికే పోలీస్, మెగా డిఎస్సిలో గిరిజన అభ్యర్థులు నష్టపోయారని, దీనిపై గిరిజన మంత్రి, గిరిజన ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రస్తావించాలని డిమాండ్ చేశారు. జిఒ3 ప్రత్యామ్నాయం వచ్చే వరకు పోరాటం ఆగదని అన్నారు.



పోలీసు అదుపులో ఉన్న గంగారాం

ప్రతి సచివాలయంలో పరిశ్రమ యూనిట్ : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ప్రతి సచివాలయ పరిధిలో జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా ఒక కొత్త యూనిట్ (పరిశ్రమ) నెలకొల్పేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పరిశ్రమల శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక గ్రామం - ఒక పారిశ్రామికవేత్తలో భాగంగా ప్రతి గ్రామం నుంచి ఒక పారిశ్రామికవేత్త వచ్చేలా లక్ష్యాలను నిర్దేశించుకొని, ఈ ఏడాది 2,100 యూనిట్లు నెలకొల్పాలన్నారు. ఇందుకు సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే సంబంధిత శాఖలైన మార్కెటింగ్, ఆం.ప్ర.నైపుణ్యాభివద్ధి సంస్థ, ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఎల్‌డిఎం తదితర శాఖలను సమన్వయం చేసుకుంటూ 2,100 యూనిట్లు స్థాపించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే వివిధ యూనిట్లను స్థాపించి విజయం సాధించిన వారి విజయగాధలను గ్రామస్థాయిలో ప్రదర్శించి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఎపిఐఐసి, ఎంఎస్ఎంఇ పార్కులు త్వరగా గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని అధికారులకు హితవు పలికారు. జిల్లా విశ్లేషణ నివేదికలో ఎటువంటి ఖాళీలు లేకుండా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి మండలంలో ప్రస్తుతం ఉన్న పరిశ్రమల వివరాలతో పాటు అనుకూలమైన పరిశ్రమల వివరాలు, మూతపడిన పరిశ్రమలు తదితర వివరాలు సేకరించాలని అన్నారు. ముఖ్యంగా మండలంలో ఏ రంగానికి చెందిన పరిశ్రమలు అధికంగా ఉన్నాయో తెలియజేయాలని, మూతపడిన పరిశ్రమలు మళ్లీ తెరచేందుకు గల అవకాశాలను అన్వేషించాలని కలెక్టర్ వివరించారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సకాలంలో అధికారులు ప్రగతిని సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎం.వి.కరుణాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోరాటంతోనే జిఎస్‌టి ఉపసంహరణ

రాజాం : దేశవ్యాప్తంగా బీమా ఉద్యోగుల సంఘం (ఎఐఐఇఎ) అఖిల భారత ఇన్సూరెన్స్ ఉద్యోగుల యూనియన్ చేసిన నిరంతర పోరాటం, ప్రజాభిప్రాయం సమీకరణ ఫలితంగా, ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంలపై అమలులో ఉన్న 18శాతం జిఎస్‌టిని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకుందని ఎస్‌సిజెడ్‌ఐఇఎఫ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్‌కె గీత ఫార్మర్ అన్నారు. స్థానిక వెంకట దుర్గా కళ్యాణ మండపంలో శనివారం ఎల్ఐసి వర్కింగ్ ఉమెన్ కోఆర్డినేట్ కమిటీ 27వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య జీవిత బీమా ప్రీమియంపై కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జిఎస్‌టి ఉపసంహరణ దేశవ్యాప్తంగా బీమా ఉద్యోగుల సంఘం కృషి అని కొనియాడారు. ఈనెల 22 నుంచి ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంపై వస్తు సేవలపై ఈ పైన పన్ను ఉండదని అన్నారు. పూర్తిగా తొలగిస్తూ సెప్టెంబర్ 3న జరిగిన 56వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం తీసుకుందన్నారు. సిఐటియు నాయకులు బి. సుధారాణి మాట్లాడుతూ ఇంతకు ముందు జిఎస్‌టితో కలిపి ప్రీమియం కట్టేవారని ఇప్పుడు జిఎస్‌టి తొలగించి కట్టుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌సిజెడ్ ఐఇఎఫ్ వైస్ ప్రెసిడెంట్ ఎం.కామేశ్వరి, జనరల్ సెక్రటరీ జి. వరప్రసాద్, కన్వీనర్ జి. సూర్య ప్రభాకర్, ప్రెసిడెంట్ పి. ప్రభాకర్‌రావు, కార్యదర్శి ఎం.జితేందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

321మందికి ఆరోగ్య తనిఖీలు
ముగ్గురు కేన్సర్ రోగుల గుర్తింపు

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ఏరియా ఆసుపత్రిలో శనివారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 321మంది మహిళలు వైద్య పరీక్షలు జరిపించుకున్నారు. ఈ సందర్భంగా ముగ్గురు కేన్సర్ రోగులను గుర్తించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి ఆధ్వర్యాన మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్వస్థ్ నారీ స శక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఈ నెల 17నుండి దేశ వ్యాప్తంగా నిర్వహిస్తుండగా అదే కార్యక్రమాన్ని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు స్థానిక ఏరియా ఆసుపత్రిలో నిర్వహించారు. శిబిరంలో పట్టణానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షితో పాటు సివిల్ సర్జన్లు, వైద్య ప్రముఖులు, పిపి యూనిట్ వైద్యులు, విశాఖ పట్నం మహాత్మ గాంధీ కేన్సర్ ఆసుపత్రికి చెందిన వైద్యులు, సాలూరు ఏరియా ఆసుపత్రికి చెందిన సిబ్బంది పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన పరీక్షలు జరిపించి, మందులు అందజేసారు. కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఎన్‌సిడీ స్క్రీనింగ్, కేన్సర్ స్క్రీనింగ్, గర్భిణీ సంరక్షణ, మాతా శిశు రక్షణ కార్డులు, టీకాలు, రక్తహీనత స్క్రీనింగ్, ఆయుష్మాన్ భారత్, పిఎంజేయేవై వందన కార్డులు, క్షయ పరీక్ష, చెవి, ముక్కు, దంత వైద్య పరీక్షలు, ఆయుష్ సేవలు, మహిళా మరియు శిశు అభివద్ధి శాఖ ఆధ్వర్యంలో పోషణ కార్యక్రమం నిర్వహించారు. తొలుత సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ మీనాక్షి మాట్లాడుతూ మహిళలు వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నారన్నారు. వారిలో పలు రకాల వ్యాధులు సోకిన వారిని గుర్తించి, అవసరమైన సలహాలతో పాటు మందులు అందజేసామన్నారు. అదేవిధంగా ముగ్గురు క్యాన్సర్ రోగులను గుర్తించామని, వారిని విశాఖ పట్నం మహాత్మా గాంధీ ఆసుపత్రికి పంపిస్తామన్నారు.



వైద్యశిబిరంలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

విరాజిల్లిన విజ్ఞానం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఔను...! విజ్ఞాన వీచిక విరాజిల్లింది. మానవాళి మనుగడలో శాస్త్ర విజ్ఞానం, వైజ్ఞానిక ప్రదర్శనలు, అభ్యుదయ ఆలోచనలు ఎంత ముఖ్యమో నొక్కివక్కానించి చెప్పింది. అంతటితో ఆగిపోలేదు... సైన్స్ ప్రత్యేకతను నిరూపించేందుకు కూడా కంకణబద్దులై పనిచేయాలని ఉక్కు సంకల్పాన్ని ప్రదర్శించింది. గడిచిన వారంలో జిల్లాలో చోటుచేసుకున్న పరిణామాల్లో ఇది అత్యంత ముఖ్యమైనదే. అదే జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభ. రెండు రోజులపాటు జరిగిన ఈ మహాసభలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ఎంతో మంది వైద్యులు, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, ఉపాధ్యాయులు అభ్యుదయవాదులు, కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, అభివృద్ధికాముకులు కలిసి అజ్ఞానపు ఆలోచనలు, తిరోగామి శక్తుల కుట్రలపై ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని తిప్పికొట్టేందుకు శక్తివంచన లేకుండా కృషిచేయాలని కూడా లక్ష్యం పెట్టుకున్నారు. ఈ పరిణామం ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇందులో పనిచేస్తున్నదెవరూ రాజకీయ పార్టీలకు చెందినవారు కాదు. ఎన్నికల జెండా, అజెండా ఉన్నవారు అసలే లేరు. కానీ, వీరంతా రాజకీయాలను మనం పట్టించుకోకపోయినా, మనల్ని రాజకీయాలు ప్రభావితం చేస్తాయన్న మూలసూత్రాన్ని మాత్రం మర్చిపోలేదు. ఇందుకనుగుణంగా అభ్యుదయ కవిగా విశ్వఖ్యాతిగాంచిన గురజాడ అప్పారావు జయంతిని



ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, ఆయన స్వగృహాన్ని సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, గురజాడ పేరిట ఓ సాంస్కృతిక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, ప్రయివేటీకరణ, సరళీకరణ, కాషాయీకరణకు కారణమౌతున్న నూతన విద్యావిధానాన్ని రద్దుచేయాలని, మహిళలకు రక్షణ కల్పించాలనే జన విజ్ఞానవేదిక మహాసభ తీర్మానాలు, వాటికి ఆమోదం తెలపడం పట్ల విజయనగరం వాసుల్లో హర్షధ్వానాలు వ్యక్తమౌతున్నాయి. మహాసభల్లో రెండోరోజు చేపట్టిన సైన్స్‌వాక్‌లో వేలాది మంది స్థానికులు హాజరు కావడం ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చని జనం చర్చించుకుంటున్నారు. ఇంతే కాదు... పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై మహాసభలో పెద్దఎత్తున చర్చ జరిగింది. పర్యావరణ పరిరక్షణ అంటే కేవలం పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నిషేధం వంటివి మాత్రమే కాదంటూ వక్తలు బోధించిన విజ్ఞానంతో పెట్టుబడిదారుల దురాశ కారణంగా ప్రాణవాయువులను కూడా కోల్పోతున్న సంగతి తెలియపర్చింది. ఓవైపు శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న పరిస్థితుల్లో మూఢనమ్మకాలు వంటి అశాస్త్రీయ ధోరణులు కూడా పెచ్చుమీరుతున్నాయి. ఇటువంటి తరుణంలో విజయనగరంలో జరిగిన జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలో సైన్స్ ఫలితాలు కొందరికే పరిమితమౌతున్నాయని, ఇవి సమాజంలో సమ్మిళితం కావాల్సిన అవసరం ఉందని వక్తలు చెప్పిన అంశాలు విజయనగరం, పార్వతీపురం వాసులను కొంతమేరకైనా శాస్త్రీయ ఆలోచనల వైపు నడిపాయడంలో సందేహం లేదని జనం చర్చించుకుంటున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఆరోగ్యకరమైన జీవన విధానానికి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. మండలంలోని రావివలస పిహెచ్‌సిలో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన వైద్య సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో మొక్కలు నాటి, నీరు పోశారు. ఆసుపత్రి ఆవరణలో పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం పిహెచ్‌సిలో ఆరోగ్య సేవలు అందుతున్న తీరుపై పరిశీలించి అక్కడ రోగులతో మాట్లాడి వారి అనారోగ్య సమస్యలు తెలుసుకున్నారు. స్వచ్ఛ ఆంధ్ర నోడల్ అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం అన్ని ఆరోగ్య కేంద్రాల పరిధిలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించి వివరాలు సాసా పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం అందరూ స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎపిడిమియాజిస్ట్ డాక్టర్ సూర్య కౌశిక్, వైద్యాధికారి డాక్టర్ కె.కీర్తి, ఇఒ ఎస్.ప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గరుగుబిల్లి: మొక్కలు నాటుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

మక్కువ: మండలంలోని గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్ది అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అంతా నడుం బిగించాలని ఎంపిడిఒం అర్జునరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులంతా కలిసి ప్రతిజ్ఞ చేస్తూ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ ఎన్.సూర్యనారాయణ, సిడిపిఒ అనంత లక్ష్మి, ఎపిఒ ఎస్.ఈశ్వరమ్మ, ఎపిఎం జయకుమార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఎస్ఎల్‌వి జోగారావునాయుడు, హౌసింగ్ ఎఇ సింహాచలం తదితరులు పాల్గొన్నారు. శంబర పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో ఎంపిటిసి పోలినాయుడు పాల్గొని మొక్కలు నాటారు.

కొమరాడ: విక్రమపురం, శివిని పంచాయతీల్లో శనివారం ఎంపిటిసి దేవకోటి వెంకట నాయుడు ఆధ్వర్యంలో కిరాణా దుకాణాల్లో ప్లాస్టిక్ వాడకూడదని కోరుతూ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సురేష్, వైద్య, పంచాయతీ, రెవెన్యూ, వెలుగు సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వెలుగు సిసి మృతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని దుడ్డుఖల్లు క్లస్టర్ పరిధిలో వెలుగు సిసిగా విధులు నిర్వహిస్తున్న మీనక లక్ష్మణరావు (52) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. మూడు నెలల నుంచి అనారోగ్యానికి గురై వైద్యం పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య సరోజిని, పిల్లలు ఉన్నారు. సిసి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎపిఎం సతీష్ లక్ష్మణరావు స్వగ్రామం మంగళాపురం వెళ్లి రూ.25వేలు చెక్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు. క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసిన తోటి ఉద్యోగిని కోల్పోయామని సిసిలు పైడా నాగేశ్వరరావు, టి.సుందరరావు, ఎన్.రాజారావు, ఎన్.దాశరథి ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మణరావు కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

నాటిక పోటీల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మ వలస మండలం మేరంగి నాటిక పరిషత్ ఆధ్వర్యంలో నవంబర్ 7,8,9 తేదీల్లో జరగబోయే తృతీయ నాటిక పోటీల గోడ పత్రికలను చిన మేరంగి కోటలో మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్ప శ్రీవాణి శనివారం విడుదల చేశారు. రోజురోజుకు అంతరించిపోతున్న కళలు, కళాకారులకు నిర్వహించబోయే నాటిక పోటీలు జీవం పోస్తాయన్నారు. ఇటువంటి నాటికలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నవంబర్ 7న స్వప్న రాల్చిన అమృతం, మా ఇంట్లో మహాభారతం, 8న అసత్యం, గారడి, 9న అమ్మ చెక్కిన బొమ్మ, మనిషి కన్నా శవం మిన్న నాటిక పోటీలు ప్రదర్శించబడతాయన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఆసక్తిగల కళాకారులు పాల్గొని వచ్చిని నిర్వాహకులు కోరారు.

పోలమాంబ ఆలయంలో దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - మక్కువ

ప్రసిద్ధిగాంచిన పోలమాంబ అమ్మవారి ఆలయంలో ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఇఒ బి.శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి సోమవారం ఉత్సవాలను ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులంతా పాల్గొని అమ్మవారి కటాక్షం పొందాలని ఆయన కోరారు.

సొంత డబ్బులతో బోరు మరమ్మతు

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామంలో తాగునీటి బోరు మరమ్మతులకు గురై ఏడాది కావస్తున్నప్పటికీ మరమ్మతు పనులు చేపట్టలేదని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించినప్పటికీ ఫలితం లేకపోయిందని, చేసేది ఏమీ లేక ఊరంతా కొంత డబ్బును పోగు చేసుకుని, తాగునీటి బోరు మరమ్మతు పనులు చేపట్టినట్లు మండలంలోని దశమంతపురం పంచాయతీ పరిధి పెద్దూరు గ్రామానికి చెందిన గిరిజనులు వాపోయారు. మరమ్మతు పనులు చేపట్టేందుకు పంచాయతీలో నిధులు లేవా? అధికారులకు తీరిక లేదా? మరి ప్రజా సమస్యలు ఏ విధంగా పరిష్కారమవుతాయని, మరమ్మతు పనులు చేపట్టలేని తిరిగి తిరిగి అలసిపోయి చివరకు గ్రామం అంత ఏకమై బాగు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, నగేష్, బి.ఆనంద్‌రావు, రాజు, ఏ.నారాయణరావు, బి నారాయణరావు తదితర గిరిజనులు ఆరోపించారు.

300 మందికి అన్నదానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలోని విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో సుమారు 300 మందికి శనివారం అన్నదానం నిర్వహించారు. విశ్వకర్మ జయంతి ఉత్సవాల్లో భాగంగా పండు ముగింపు రోజున అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు విశ్వబ్రాహ్మణుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.గౌరీశ్వరరావు తెలిపారు. ఏటా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట, లక్కగూడ, పి.లేవిడి తదితర గ్రామాల నుంచి ప్రజలు వచ్చి అన్నదానం స్వీకరించారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని యర్రన్న గుడి జంక్షన్ వద్ద వాహనదారులకు ఎస్ఐ ఫక్రుద్దీన్ హెల్మెట్ వాడకంపై శనివారం అవగాహన కల్పించారు. మండలంలో అందరికి పరిచయమున్న భద్రవలస నయారా పెట్రోల్ బంక్ యజమాని మారడాన సత్యనారాయణ ఎప్పుడు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం వల్ల సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ వేసుకుని ప్రయాణించాలని తెలిపారు.

దసరా సంబరాలు ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బొబ్బిపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆ గ్రామంలో దసరా సంబరాలు ప్రారంభించారు. విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి దసరాకు వస్తాం... వినవినేలు పడకండి అంటూ పాట పాడుతూ వివిధ రూపాలో వస్త్రధారణ ధరించి వీధుల్లో తిరిగారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణారావు, సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే గ్రామంలో స్వచ్ఛ భారత్ ర్యాలీ నిర్వహించి అనంతరం స్కూల్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.

గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు అర్హులైన గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాచిపెంట మండలం పి.కోనవలస గిరిజన బాలికల గురుకుల కళాశాలలో తెలుగు, ఇంగ్లీష్, లెక్కలు, ఫిజిక్స్, కెమిస్ట్రీ, గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి గిరిజన బాలికల గురుకుల కళాశాలలో ఇంగ్లీష్, కెమిస్ట్రీ, జువాలజీ, కురుపాం బాలికల కళాశాలలో ఇంగ్లీష్, ఫిజిక్స్, భద్రగిరి బాలుర గురుకుల కళాశాలలో ఎకనామిక్స్, సీతానగరం మండలం, జోగింపేట ఎస్ఒఇ లో తెలుగు, పి.కోనవలస బాలుర కళాశాల లో ఫిజిక్స్ సబ్జెక్టులకు అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆ పోస్టులు అర్హులైన గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని కలెక్టర్‌కు వినతిని ఇవ్వనున్నామని, ఇందులో గిరిజన నిరుద్యోగ యువత రావాలని కోరారు.

309 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని బిటివాడ, వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వండువ, చిట్టిపూడి వలస గ్రామాల్లో శనివారం ఎస్ఎన్ఎస్ పిఎ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్యాధికారులు ఎ.మానస, ఎం.సాయికుమార్ 309 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, చిన్నారులు, గర్భిణీలు, రక్తపోటు, మధుమేహ, కేన్సర్, సికిల్ సెల్ తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్యతనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టంలో వర్షం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని శనివారం సాయంత్రం కుండ పోత వర్షం కురిసింది. గత మూడు రోజులుగా ఎండ తీవ్రతో అల్లాడిపోతున్న ప్రజలు ఆకాశంలో ఎటువంటి మబ్బులు లేకుండా ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దీంతో మురికి కాలువలో నీరు రహదారిపై ప్రవహించింది. రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడ్డారు.

ప్రణాళికాబద్ధంగా బోధించాలి : డిఇఒ

ప్రజాశక్తి - సీతానగరం

టెన్త్ తరగతి విద్యార్థులకు ప్రణాళిక బద్ధకంగా బోధించాలని డిఇఒ కె.రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని పూజ క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పదో తరగతికి విద్యను ప్రగతి విద్యా శక్తిని ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలన్నారు. క్లాస్ అటెండెన్స్ ఎఫ్ఎ-1 మార్కులు నమోదు ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సాంబశివరావు, ఎస్ఎ పాత్రుడు, విజయలక్ష్మి, రీసోర్స్ పర్సన్ కూర్మనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరఘట్టం: సి గ్రేడ్ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంఇఒ -1 డి గౌరినాయుడు సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర)లో ఏర్పాటు చేసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతిరోజు ఒక గంట కేటాయించి ప్రత్యేక తరగతలు నిర్వహించేందుకు బాధ్యత వహించాలన్నారు. లాంగ్ ఆప్సెంట్లు ఉన్న విద్యార్థులను గుర్తించి వారు పాఠశాలకు వచ్చే విధంగా చూడాలన్నారు. మధ్యాహ్న భోజనం పనితీరు పాఠశాల పరిశుభ్రత వాతావరణంలో ఉండే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బి.సోంబోర, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెపి నాగమణి, వెంకట్రావు, జి శ్రీనివాసరావు, జి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్‌లో బార్ ఏర్పాటుపై పరిశీలన

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో బార్ ఏర్పాటు చేసేందుకు విమానయాన సంస్థ ప్రతినిధుల అభ్యర్థన మేరకు జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎస్. దొర శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విమానాశ్రయంలో బారు ఏర్పాటుకు చట్టబద్ధమైన నిబంధనలు ఇంకా రాలేదని విమానయాన అధికారుల అభ్యర్థన మేరకు స్థలాన్ని పరిశీలించామని చెప్పారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వస్తే బార్ ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ కొమరాడ ప్రాజెక్టు అధికారి జి.సుగుణకుమారి అన్నారు. శనివారం మండలంలోని దలైపేట సచివాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ్‌మహ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు చేసి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల రోజుల పాటు పోషణ్ పఖ్వాడాగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్‌వైజర్లు ఆదిలక్ష్మి, సిబ్బంది, గర్భిణుల తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మహా కార్యక్రమంలో భాగముగా మండలంలోని తోటపల్లి, రావుపల్లి గ్రామాల్లో శనివారం అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. రావుపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను గ్రామపంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు (మహేష్) సందర్శించారు. కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని గరుగుబిల్లి సెక్టార్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి, పెదగుడబ ఐసిడిఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ పి. బంగారమ్మలు పౌష్టికాహారం ప్రాధాన్యత గురించి ప్రజలకు వివరించారు. పౌష్టికాహార ప్రదర్శనలో ఆకుకూరలు, కాయగూరలు, గుడ్లు, శనగ ఉండలు తదితర వాటిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్లు ఎం.సావిత్రి, పి.మంగ, సిహెచ్ అరుణ, జి. సంగమ్మ, కె.సుజాత, పి. ఆరుద్ర, కె.పుష్పలత, జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారాన్ని ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పెద్దూరును పంచాయతీగా ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని పెద్దూరు గిరిజన గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆ గ్రామానికి చెందిన నిమ్మక నగేష్, బి.ఆనందరావు, ఎ.నారాయణరావు, రాజు, బి.నారాయణరావు, పలువురు గిరిజనులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. పెద్దూరు, సింధు నగర్, గోపాలపురం కాలనీ, సవరగోపాలపురం, అచ్చెప్పవలస గ్రామాలను కలిపి ఒక పంచాయతీగా ఏర్పాటు చేయాలని, ఐదు గిరిజన గ్రామాల్లో 900 మంది జనాభా, 750 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 2020లో బిటివాడ, నడుకూరు, హుస్సేన్‌పురం, కత్తుల కవిటి, సంత నర్సిపురం, చిదిమి పంచాయతీలకు అనుసంధానంగా ఉన్న గ్రామాలు ఎంవి పురం, వెంకంపేట, కె.ఇచ్ఛాపురం, కంబరవలస, మూలలంక, ఎం.రాజపురం, గదబవలస, చినగోర కాలనీలను పంచాయతీలుగా ఏర్పాటు చేశారని, తమ గ్రామం వైపు చిన్న చూపు చూసినట్టు వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు గ్రామాలు ఒకే చోట రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని, చిత్తూరు గిరిజన గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే వి.కళావతికి, ఐటిడిఎ పిఒలకు పలుమార్లు గ్రీవెన్స్‌లో వినతులు అందజేసినా ఫలితం లేకపోయిందని వారన్నారు. పెద్దూరు, సింధునగర్ గ్రామాలు దశమంతపురం పంచాయతీ పరిధిలో ఉన్నాయని, గోపాలపురం కాలనీ, సవర గోపాలపురం గ్రామాలు చలివేంద్రి పంచాయతీలో ఉన్నాయని, అచ్చెప్పవలస గ్రామం వీరఘట్టం మేజర్ పంచాయతీలో ఉందన్నారు. ఆయా పంచాయతీల్లో ఈ ఐదు గ్రామాలున్నందున వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం, రేషన్ బియ్యం కోసం 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న పంచాయతీ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తాము పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పెద్దూరును పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణకే వైద్యశిబిరాలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మహిళల ఆరోగ్యం పరిరక్షణ కోసమే స్వస్థనారీ స్వశక్త పరివార్ అభియాన్ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందని బందలుప్పి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రమ్య సాయి అన్నారు. శనివారం బందలుప్పిలో నిర్వహించిన వైద్యశిబిరంలో ఆమె మహిళలకు ఆరోగ్యంపై అవగాహన, పోషకాహార ఆవశ్యకతను వివరించారు. ఈ శిబిరంలో దీర్ఘవ్యాధులతో బాధపడుతున్న వారికి తగు వైద్య పరీక్షలు చేసి వారికి కావలసిన మందులు ఇవ్వడం జరిగిందని, అదే విధంగా నిరాధరణ పరీక్షలు, నిక్షయ్ మిత్రల నమోదు, సికిల్ అనీమియా పరీక్షలు నిర్వహించి, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో గొట్టాపు వెంకట్ నాయుడు, ప్రమీలమ్మ, ప్రతాప్, సూపర్వైజర్లు శ్రీరాములు నాయుడు నాగమ్మ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బూర్జ, లక్ష్మీపురంలో ఉచిత వైద్య శిబిరం

సీతానగరం: మండలంలోని బూర్జ, లక్ష్మీపురంలో పెదంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా పెదంకలాం పిహెచ్‌సి వైద్యాధికారి పి.శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరాలు ప్రత్యేకంగా మహిళల కోసం ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరాల ద్వారా మహిళల్లో ఉండే రక్తహీనత, పోషక విలువలు, గర్భిణీలు అలాగే యుక్తవేశ ఉన్న మహిళల్లో అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేసి వారికి కావాల్సిన వైద్యం అందించి మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేన్సర్, క్షయ వ్యాధులకు స్క్రీనింగ్ పరీక్షలు చేయబడతాయన్నారు. కార్యక్రమంలో ఇఒ జి.సూర్యనారాయణ, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కస్తూరిబాయి పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

మండలంలోని జోగింపేట కస్తూరిబాయి బాలికల పాఠశాల, స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్ ప్రతిభ పాఠశాలలో విద్యార్థులకు సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధి . కారిని పి.ఉషారాణి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు ప్రత్యేకమైన వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వారికి రక్త పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించినట్లు తెలిపారు. విద్యార్థులకు రక్తపరీక్షలు అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఎస్వి రమణ, హెచ్ ఎస్ రమణారావు, ప్రిన్సిపల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - చీపురుపల్లి

చీపురుపల్లి లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆంజనేయపురంలో గల పల్లా వెంకయ్య ఆసుపత్రి సమీపంలో ఉచితంగా సుగర్, బిపి వంటి వైద్య పరీక్షలను శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ పేదలకు ప్రతీ శనివారం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా సుగర్, బిపి పరీక్షలు చేస్తున్నామన్నారు. ఇటువంటి కార్యక్రమాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షుడు కోరాడ శంకరరావు, లైన్స్‌క్లబ్ ప్రతినిధులు ఎస్ సన్యాసిరావు, వైద్యులు పల్లా వెంకయ్య, డి. సీతారామరాజు, కందుల పుండరి, ట్రెజరర్ కందుల ాగశంకర్, మిరియాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వట్టిగెడ్డలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని నడుకూరుకు చెందిన గేదెల శ్రీనివాసరావు (49) వట్టిగెడ్డలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసరావు కాలకృత్యాలు తీర్చుకునేందుకు శనివారం తన ఇంటి నుండి వట్టిగెడ్డకు వెళ్లాడని, తిరిగి ఇంటికి రాకపోవడంతో శనివారం 10గంటల సమయంలో వట్టిగెడ్డ వంతెన కింద పొదల్లో మృతదేహం ఉందని స్థానికులు గుర్తించారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా నడుకూరుకు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్సై జి.కళాధర్ తెలిపారు. శ్రీనివాసరావుకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారుడు దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- సీతంపేట

కొత్తూరు రహదారి మార్గంలో గ్రానైట్ రాయి లోడుతో వస్తున్న లారీ ఐటిడిఎ సమీపంలో అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కింది. గ్రానైట్ రాయి కింద పడకపోవడం, ఆ సమయంలో ప్రయాణికులు ఎవరూ రాకపోకలు చేయకపోవడంతో ప్రమాదం తప్పిందని ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

కొండచిలువ హతం

ప్రజాశక్తి - మక్కువ

మక్కువలోని సువర్ణముఖి నది వంతెన సమీపంలో ఉన్న చికెన్ సెంటర్‌లోకి శనివారం ఉదయం కొండచిలువ ప్రవేశించింది. రెండు కోడిపిల్లలను మింగి, మరో కోడిని చుట్టేసి చంపే ప్రయత్నం చేసింది. కోళ్లు బిగ్గరగా అరిచి చెల్లాచెదురు కావడంతో షాపు యాజమాని కొండ చిలువను గుర్తించాడు. స్థానికుల సాయంతో కొండచిలువను హతమార్చాడు. సుమారు పది అడుగుల పొడవు ఉన్న ఈ కొండ చిలువను చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు.

గ్రామ రక్షకులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - కొమరాడ

సకాలంలో చెత్త సేకరణ చేసి గ్రామాలను రక్షిస్తున్న గ్రామరక్షకులైన పారిశుధ్య కార్మికులకు సన్మానం చేయడం చాలా సంతోషకరంగా ఉందని ఎంపిడిఒ ఎస్.రమేష్ అన్నారు. శనివారం మండలంలోని గంగరేకువలస సచివాలయంలో పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లకు ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎప్పటికప్పుడు ప్రజల వద్ద నుంచి చెత్త సేకరించి ఎస్‌డబ్ల్యుపి కేంద్రాలకు తరలించి గ్రామాలను రక్షిస్తూ ప్రజలు ఆరోగ్యంపై దృష్టి పెట్టిన పెట్టిన కార్మికుల సేవలు గొప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి రాధాకృష్ణ, ఎంపిటిసి గంట వెంకటనాయుడు, బిజెపి మండల అధ్యక్షులు ద్వారపూడి సురేష్, సచివాలయ పిఎస్ తిరుపతి రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్‌కు సన్మానం

పాచిపెంట: మండలంలోని మిర్తివలస పంచాయతీలో పారిశుధ్య పనులు చేస్తూ పంచాయతీ ప్రజల మన్ననలు పొందిన గ్రీన్ అంబాసిడర్ పరమేష్‌ను శనివారం సన్మానించారు. ప్రభుత్వం సకాలంలో వేతనం ఇవ్వకపోయినా పంచాయతీని స్వచ్ఛభారత్ స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ మిర్తివలసగా చేసేందుకు కీలక పాత్ర వహించడంలో గ్రామ క్లాప్ మిత్రగా, గ్రీన్ అంబాసిడర్ పరమేశను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ కొత్తల సత్యవతి మండల టిడిపి ఉపాధ్యక్షులు కొత్తల పోలినాయుడు గ్రామస్తులు కలిసి సన్మానించారు.

సిఫార్సును అమలు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర అమలు చేసే విధంగా సోమనాథ్ సిఫార్స్ అమలు చేసే విధంగా భవిష్యత్తులో జరిగే పోరాటాలకు రైతులు ముందుకు రావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బంటు దాసు అన్నారు. శనివారం కళ్ళికోట గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమనాథ్ సిఫార్స్ అమలు చేయడంతో పాటు రైతులు పండించిన పంటలకు గిట్టిబాటు ధర కల్పించే విధంగా నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రైతులందరూ రాబోయే రోజుల్లో పోరాటానికి సిద్ధంగా ఉండాలన్నారు. మహాసభలో కొమరాడ మండల రైతు సంఘం కార్యదర్శిగా ఎ.ఉపేంద్ర, మండల రైతు సంఘం ఉపాధ్యక్షులుగా రెడ్డి అప్పలస్వామి నాయుడుతో పాటు ఆరుగురు కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నామన్నారు. అనంతరం మహాసభలో పలు సమస్యలపై భవిష్యత్తులో పోరాటాలు చేయాలని తీర్మానం చేశారు. ఈ సభలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, కె.త్రినాథ్, బి.శ్రీను, బద్దన్న, బి.గౌరీ శంకర్రావు, పి.సింహాచలం, వి.రాము, నారాయణరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యులను గుర్తించాలి

ప్రజాశక్తి- సాలూరు

వివిధ ప్రభుత్వ పథకాల కింద రుణాలు తీసుకొని, విజయవంతంగా వ్యాపారాలు నిర్వహిస్తూ అధిక ఆదాయం పొందుతున్న మహిళా సంఘాల సభ్యులను గుర్తించి ఆజీవికా యాప్‌లో నమోదు చేయాలని జిల్లా డిఆర్‌డిఎ డిపిఎం శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక మండల వెలుగు కార్యాలయంలో ఎపిఎం అంపల్లి జయమ్మ ఆధ్వర్యంలో జరిగిన సీసీలు, విఒఎల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్ఆర్ఎల్ఎం పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన లోకాష్, విపిఆర్‌పి యాప్‌లలో మహిళా సంఘాల సభ్యుల నెలవారీ ఆర్థిక లావాదేవీలను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. సభ్యుల రేషన్ కార్డులు, జాబ్ కార్డులు వంటి వివరాలతో పాటు, గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కూడా ఆ యాప్‌లో నమోదు చేయాలన్నారు. అన్ని రకాల రుణాలను వంద శాతం వసూలు చేయాలని, కొత్త రుణాల మంజూరులో పురోగతి చూపించాలని కోరారు. ఈ సమావేశంలో స్త్రీ నిధి ఎపిఎం, సభ్యులు పాల్గొన్నారు.

గురజాడకు నివాళి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గురజాడ జయంతి సందర్భంగా మహాకవి గురజాడ అప్పారావు విగ్రహానికి గురజాడ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు శనివారం ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా గురజాడ పాఠశాల చిన్నారులతో గురజాడ వేషధారణ పోటీలను నిర్వహించారు. జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణ పబ్లిక్‌స్కూలులో గురజాడ జయంతి

విజయనగరంకోట : తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప వ్యక్తి గురజాడ వెంకట అప్పారావు అని తెలుగు భాష సేవా సంఘం అధ్యక్షుడు ఆర్‌బి రామానాయుడు అన్నారు. గాజుల రేగ నారాయణ పబ్లిక్ స్కూల్ గురజాడ 164వ జయంతోత్సవం పాఠశాల కరస్పాండెంట్ మొయిద నారాయణరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా గురజాడ చిత్రపటానికి ఉపాధ్యాయులు విద్యార్థులు పూల మాలలతో నివాళులర్పించారు అనంతరం గురజాడ రచించిన దేశభక్తి గేయాలను చేత పాడించి వాటిపైన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

రామభద్రపురం: తక్కువ ఖర్చులతో అధిక దిగుబడులు సాధించే విధానాలు అవలంబించి వ్యవసాయాన్ని లాభసాటిగా మలచుకోవాలని ఎఒ అమర శివ సూచించారు. శనివారం ఆరికతోటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఇఒ శరత్, రైతు సేవా కేంద్రం సిబ్బంది రేవతి, రాము పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించి ఉపాధి చూపండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గంలో గత కొన్నేళ్లుగా ఉన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి సహకరించాలని, గిరిజన యువతకు ఉపాధి కల్పించి వారి ఆర్థికాభివృద్ధికి చేయూత ఇవ్వాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం సాయంత్రం అమరావతిలో సిఎం చంద్రబాబును కోరుతూ వినతినిచ్చారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ముఖ్యంగా భద్రగిరిలో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేసి నిధులు మంజూరు చేయాలని, నిర్మాణంలో ఉన్న కురుపాం గిరిజన ఇంజనీరింగ్ కళాశాల పనులు పూర్తికి నిధులు మంజూరు చేసి 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్స్ జరిగే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న మినీ స్టేడియాన్ని పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా చర్యలు చేపట్టి గిరిజన క్రీడాకారుల క్రీడా శిక్షణకు సహకరించాలని, కొమరాడ మండలంలో ఉన్న వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు జంఝావతి రిజర్వాయిర్ ప్రాజెక్ట్ పూర్తి చేసి సాగునీరు, తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన పారా అథ్లెటిక్స్ క్రీడాకారిణికి ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందించాలని కోరామన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో చిన్న తరహా జీడీ పిక్కల పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు, యువతకు ఉపాధి కల్పించి, వారి ఆర్థికాభివృద్ధికి సహకరించాలని కోరుతూ వినతి అందించినట్లు చెప్పారు. పై సమస్యలను పరిశీలించిన సిఎం పరిష్కరించేందుకు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

సిఎం చంద్రబాబుకు విన్నవించిన ఎమ్మెల్యే జగదీశ్వరి



సిఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

సెలవులొచ్చాయ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించ డంతో మండల ంలోని పలు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఒకరోజు ముందుగానే శని వారం తల్లిదండ్రులతో కలిసి తమ గ్రామాలకు బయలు దేరారు. భద్రగిరి పిటిజి, ఏకలవ్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు సమీప గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో కూడా విద్యార్థులు ఇంటికి పయనమయ్యారు. వందలాది మంది విద్యార్థులు ఒక్కసారిగా ఆటోలు, బస్సులు ఎక్కడంతో కిక్కిరిశాయి. దీంతో పాఠశాలలు నిర్మానుష్యంగా మారాయి.

సీతంపేట: సీతంపేట ఐటిడిఎ పరిధిలో చదువుతున్న విద్యార్థులకు దసరా సెలవులు రావడంతో వారంతా ఇళ్ల బాట పట్టారు. సీతంపేటలో చదువుతున్న విద్యార్థులు తమ పెట్టులతో ఇంటికి వెళ్తూ దర్శనమిచ్చారు.

హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - సీతానగరం

వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ఉషారాణి తెలిపారు. స్థానిక పిహెచ్‌సి పరిధిలో జోగింపేటలో గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్, కెజిబివి చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల సిక్ రిజిష్టర్స్, ఆరోగ్య తనిఖీ వివరాల రికార్డులు పరిశీలించి ఏ విధమైన ఆరోగ్య సమస్యలు నమోదవుతున్నాయి, వీరికి అందించిన చికిత్సా వివరాలు తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యల వివరాలు, పరీక్షల నివేదికలు సిక్ రిజిష్టర్‌లో స్పష్టంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. జ్వరాలు గుర్తించిన విద్యార్థులకు నిర్ధారణ పరీక్షలు వెంటనే జరిపి, తగు మందులు ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది హాస్టళ్లను తరుచుగా సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిశీలన చేయాలని చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించి అవసరం మేరకు మందులు ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో ఆయా కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ మురళి, హాస్టల్ హెల్త్ సిబ్బంది, ఆశాకార్యకర్త తదితరులు ఉన్నారు.